

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





ఆదివారం, జూలై 12, 2026 పేజీలు : 4


# భూ రీ-సర్వేకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

- భూ భారతి సమర్థ అమలుకు రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే చేపట్టాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**మహబూబ్‌నగర్, 11 జూలై (ప్రజా జ్యోతి బ్యూరో)** భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ–సర్వే ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం ఐడీఓసీ కార్యాలయం నుంచి భూ రీ–సర్వే, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొనగా, మహబూబ్‌నగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి వ్యవస్థను రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు సంపూర్ణ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలను పూర్తిస్థాయిలో అందుకోలేకపోయామని పేర్కొన్నారు

# కోర్టు కేసుల సత్వర విచారణకు సమన్వయంతో పనిచేయాలి

- బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి: జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, 11 జూలై (ప్రజా జ్యోతి బ్యూరో)** కోర్టు విచారణలో ఉన్న కేసులను సకాలంలో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, కోర్టు విచారణలో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సాక్షులు నిర్ణీత సమయంలో కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో, హత్య, దోపిడీ వంటి తీవ్రమైన కేసుల విచారణలో



## ప్రగతి పోర్టల్‌లో మధ్యాహ్న భోజన పథకం వివరాలు

# నమోదు చేయాలి

- పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- వంటలకు గ్యాస్ సిలిండర్ల వినియోగాన్ని అమలు చేయాలి
- డైట్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి,
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ : జులై 11 (ప్రజా జ్యోతి) కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రగతి పోర్టల్‌లో జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని,అదే విధంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం వివరాలను కూడా నిర్దేశిత విధానంలో నమోదు చేసి ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాన్ని అధికారులు పర్యవేక్షించి ప్రభుత్వం అమలు చేసే పథకాల ప్రయోజనాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్విద్యాశాఖ అధికారులకు సూచించారు.శనివారంజిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రగతి పోర్టల్‌లో సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాల నమోదు,మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలల మౌలిక వసతులు,విద్యా ప్రమాణాల మెరుగుదల



## ఎస్ఐఆర్ డిజిటైజేషన్ ప్రక్రియను జూలై 20లోపు

# పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం



# ప్రగతి పోర్టల్‌లో మధ్యాహ్న భోజన పథకం వివరాలు నమోదు చేయాలి

తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులు,సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో సమగ్రంగా చర్చించి పలు కీలక సూచనలు చేశారు.సమగ్ర శిక్ష అభియాన్ కింద జిల్లాలో కొనసాగుతున్న పాఠశాల భవనాల నిర్మాణాలు,అదనపు తరగతి గదులు,తాగునీరు,
మరుగుదొడ్ల సౌకర్యాలు,విద్యుత్ వసతులు, ప్రహరీ గోడలు,మరమ్మతు పనులు,ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆరా తీసి చేపట్టిన ప్రతి పనిని నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం పూర్తి చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి పంపే సమాచారం ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేకంగా సమీక్షించిన కలెక్టర్ ప్రభుత్వ మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యమైన,పరిశుభ్రమైన,పోషకాహారంతో కూడిన భోజనం, ఆహారపదార్థాల నాణ్యత,వంటశాలల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం,ఆహార నిల్వ విధానం వంటి అంశాల్ని నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,ముఖ్యంగా మధ్యాహ్న భోజన వంటల్లో కట్టెల వినియోగానికి బదులుగా గ్యాస్ సిలిండర్లనే పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు చేపట్టాలని అవసరమైన ప్రతి పాఠశాలకు గ్యాస్ సిలిండర్లు,స్టవ్‌లు,ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లాలో ఎక్కడైనా సిలిండర్ల కొరత ఉంటే వెంటనే గుర్తించి వాటి ఏర్పాటుకు యంత్రాంగం తరపున సహకారం అందిస్తామని,జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణను బలోపేతం చేసి,నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్) కళాశాల ఏర్పాటుకు



అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపి,భవనం ఏర్పాటు, భూమి లభ్యత,మౌలిక సదుపాయాలు,ఇతర అవసరాలకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని,ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు,విద్యా ప్రమాణాల మెరుగుదల,మౌలిక వసతుల కల్పన,సమగ్ర శిక్ష కార్యక్రమాల సమర్థవంతమైన అమలు అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్,సమగ్ర శిక్ష అభియాన్ సెక్టోరియల్ అధికారులు బరపటి వెంకటయ్య,నూరుద్దీన్,జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు,కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్,వెంకటేశ్వర్లు,సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

## కోర్టు కేసుల సత్వర విచారణకు సమన్వయంతో పనిచేయాలి

ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, దర్యాప్తు అధికారులు, ప్రభుత్వ అభియోగ న్యాయవాదులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేసులకు సంబంధించిన పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించడం ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు సమన్లు, వారెంట్లు, ప్రొక్లమేషన్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా



విధులు నిర్వర్తించాలని ఆమె ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింలు, ఐటీ సెల్ ఎస్ఐ రవి, కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటైజేషన్ ప్రక్రియను జూలై 20లోపు పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్, 11 జూలై (ప్రజా జ్యోతి బ్యూరో) ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) ప్రక్రియను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.శనివారం కొత్తకోట, మదనాపురం, అడ్డాకల్, మూసాపేట్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, కొత్తకోట, మదనాపురం మండలాల్లోని గోవిందహళ్లి, దంతనూరు గ్రామాలు, అడ్డాకల్ మండలంలోని కందూరు గ్రామం, మూసాపేట్ మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిటైజేషన్ పనుల పురోగతిని సమీక్షించిన అదనపు కలెక్టర్, ఇప్పటివరకు స్వీకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి, ఎలాంటి జాప్యం లేకుండా డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే తమ సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌ఓ) సంప్రదించి ఫారాలను సమర్పించాలని ఆయన కోరారు. ఫారాలు సమర్పించని వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉన్నందున, అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని సూచించారు.ఈ తనిఖీలో ఆయా మండలాల తహసీల్దార్లు, బీఎల్‌ఓ సూపర్వైజర్లు, బీఎల్‌ఓలు, గ్రామ సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి కె. శరత్

అచ్చంపేట, జూలై 11 : శ్రీశైలం ఉత్తరద్వారంగా ప్రసిద్ధి చెందిన రంగాపురంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి కె. శరత్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట న్యాయమూర్తితో కలిసి ఆలయానికి చేరుకున్న ప్రధాన న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, గర్భగుడిలో స్వామివారి అభిషేకం తదితర ప్రత్యేక పూజలను వైదిక పద్ధతిలో నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదం అందజేసి, శేషవస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కె. శరత్ ఆలయ ఆధ్యాత్మిక వాతావరణం, నిర్వహణ ఎంతో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఆలయంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ, భక్తులకు అందుతున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## భూ రీ-సర్వేకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సంబంధిత సమస్యలను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. రీ-సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేసి, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.
రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లిస్తామని, ఇందులో రూ.50 పారితోషికం, రూ.10 రవాణా, ఇతర ఖర్చుల కోసం అందజేస్తామని చెప్పారు. చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువు విధించి, ఆ తర్వాత కూడా చేరని వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా చేపడతామని వెల్లడించారు.సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ఇందిరమ్మ ఇళ్ల తొలి విడత నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హులను కూడా రెండో విడతలో చేర్చాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో నవంబర్‌లోపు, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి-2027లోపు రీ-సర్వే పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు.
హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలను స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. జూలై 15లోపు బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని, ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, భూ రీ-సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు.
ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

1

# నాయినిపల్లి మైసమ్మ.. దేవస్థానంలో మౌలిక వసతుల కల్పనకు కృషి



- ప్రతి ఆదివారం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలి
- ఆలయ అభివృద్ధిపై గ్రామసభ నిర్వహించి తీర్మానాలు చేయాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ జులై 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినిపల్లి మైసమ్మ దేవస్థానానికి రాష్ట్రంలోని నలుమూలల నుండి ప్రతి ఆదివారం వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మెరుగైన మౌలిక వసతుల సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని దశలవారీగా పరిష్కరించాలని, భక్తులకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ సూచించారు.

శనివారం జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నాయినిపల్లి మైసమ్మ దేవస్థానాన్ని సందర్శించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులువేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్, ఆలయ ఈవో, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఎక్సైజ్, గ్రామపంచాయతీ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రతి ఆదివారం వివిధ జిల్లాల నుండి వేలాది మంది భక్తులు నాయినిపల్లి మైసమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నందున వారి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని, తగిన సంఖ్యలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం, విశ్రాంతి కోసం షెడ్లు, అవసరమైన చోట్ల విద్యుత్ వెలుగులు కల్పించాలని ఆదేశించారు.ఆలయానికి వచ్చే ప్రధాన రహదారిపై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్న నేపథ్యంలో రహదారి విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భక్తులు తమ వాహనాలకు పూజలు నిర్వహించే ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా యూ-టర్న్ సౌకర్యం, వాహనాల రాకపోకలకు అనువైన మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఆలయ అభివృద్ధి, ఆలయ భూముల పరిరక్షణ, పరిసర ప్రాంతాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన శాశ్వత సౌకర్యాల కల్పన వంటి అంశాలపై వచ్చే సోమవారం చిన్న కార్పాముల గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, అధికారులు పాల్గొని ఆలయానికి సంబంధించిన సమస్యలపై సమగ్రంగా చర్చించి తీర్మానాలు చేయాలని, ఆ తీర్మానాల ఆధారంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని సూచించారు.

దేవదాయ శాఖ నుంచి ఆలయ అభివృద్ధికి కావలసిన అనుమతులను తీసుకోవాలని ఈవోను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఆదివారం భక్తులు నిర్వహించే అన్నదానాలు, విందు కార్యక్రమాలు క్రమబద్ధంగా జరిగేలా ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలని, ఇక్కడి ఆచారం ప్రకారం ఆలయ ప్రాంగణంలో భక్తులు మద్యం విందు కార్యక్రమాలు నిర్వహించే వాటికి ఆలయ ఈవో ద్వారానే ఆలయ ప్రాంగణం రెండు నిర్వహించే మొత్తం విందు కార్యక్రమాలకు ప్రతి ఆదివారం ఒకే ఫీజు చెల్లించి, ఎక్సైజ్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈవోను ఆదేశించారు. దీనివల్ల కార్యక్రమాల నిర్వహణలో పారదర్శకత పెరగడంతో పాటు ఆలయ పరిపాలన కూడా సక్రమంగా



కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.ఆలయ అభివృద్ధికి సంబంధించి వివిధ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, భక్తులకు ఇబ్బందులు కలిగించే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.దేవదాయశాఖ నుండి అవసరమైన మేరకు సౌకర్యాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ పెద్ద కారుపాముల గ్రామంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఈనెల 24వ తేదీ లోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బిఎల్వోలు విధిగా ప్రతి ఓటర్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటర్ను ఓటర్ జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి వి. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్, పెద్దకొత్తపల్లి తాహసిల్దార్ శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈవో), వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్

**వంగూర్ జూలై 11 (ప్రజా జ్యోతి)**

పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు కార్మిక కూలి ఉద్యోగ వ్యతిరేక విధానాలపై సమరసిర పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభానికి ముందుగా సిపిఎం జెండాను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సి ఆంజనేయులు ఆవిష్కరణ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడి భూములను పేదలకు పంచిన అమరులైన డి వెంకట్ రెడ్డి ,వేనేపల్లి నరసింహారావు ,చిత్రపటాలకు అబ్బాస్, ఏపీ మల్లయ్య లు పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం అబ్బాస్ మార్క్సిజం భారతదేశానికి ఎలా అన్వయించాలి అనే పాఠాన్ని పార్టీ సభ్యులకు బోధించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి నుంచి ఈనాటి వరకు భారతదేశంలో కుల పీడన దోపిడి అణిచివేత కొనసాగుతున్నాయని అన్నారు. సిపిఎం పార్టీ భారతదేశంలో ఏర్పడిన నాటి నుంచి రైతులు కూలీలు కార్మికులు ఉద్యోగ నిరుద్యోగ కుల కులవివక్ష అంటరానితనానికి వ్యతిరేకంగా నికరంగా నిలబడి పోరాడుతున్నదని అన్నారు. పోరాడి సాధించుకున్న రైతు కార్మిక ఉద్యోగ చట్టాలను రద్దు చేస్తూ పెట్టుబడిదారులకు భూస్వాములకు గుత్త పెట్టుబడిదారులకు బహుళ జాతి కంపెనీల యజమానులకు అనుకూలంగా దేశాన్ని పాలించిన పాలకులు వ్యవహరిం చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు కార్మిక కూలి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలో కొనసాగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను అరికట్టడానికి ప్రజలను సమీకరించి క్షేత్రస్థాయి నుంచి పోరాటాలకు సిద్ధం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, ఎల్ దేశా నాయక్, సి ఆంజనేయులు, బి ఆంజనేయులు, కే గీత,రామయ్య ,నరసింహ ,అంతటి కాశన్న, శివవర్మ ,బి బాలస్వామి, శివరాములు, తారా సింగ్, మధు జిల్లా మండలం గ్రామ పార్టీ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.



## శనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు

**నాగర్ కర్నూల్ : జులై 11(ప్రజాజ్యోతి)**

శ్రీ పరాభవ నామ సంవత్సరం నిజ జేష్ఠ మాసం ద్వాదశి కృతిక నక్షత్రము సందర్భంగా బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేఖాలు వేదమంత్రచరణలమధ్య జరిగాయి.శ్రీ సార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక తిలతైల అభిషేఖ పూజలు నిర్వహించి అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్.

గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని,ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు,గ్రామ సర్పంచ్ సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్,ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి,ఆర్చకులు శాంతి కుమార్,ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.



# సంజయ్‌నగర్‌లో కమ్యూనిటీ కనెక్టింగ్ కార్యక్రమం

### – 29 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం – డీఎస్పీ వెంకటేశ్వర్లు




**మహబూబ్‌నగర్, 11 జూలై (ప్రజా జ్యోతి బ్యూరో)**
జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజయ్‌నగర్ కాలనీలో శనివారం కమ్యూనిటీ కనెక్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు స్థానిక యువతతో ముఖాముఖిగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొంటూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కల్పించారు. ప్రతి కాలనీ, ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరస్థులను త్వరగా గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 29 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను స్వాధీనం చేసుకుని సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు చేపట్టారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, సురక్షిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువత, కాలనీవాసులు పాల్గొన్నారు.

# పెద్దమారూర్,లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్

### అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోవద్దు
### 'సర్' ప్రక్రియపై నిర్లక్ష్యం వీడాలి: తహసీల్దార్ శ్రీనివాస్





**చిన్నంబావి, జూలై 11 (ప్రజా జ్యోతి )**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా.సవరణ--2026 (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న 'సర్' ప్రక్రియపై గ్రామాల ప్రజలు నిర్లక్ష్యం వీడి చురుకుగా పాల్గొనాలని.చిన్నంబావి మండల తహసీల్దార్ కే. శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దమారూర్, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఆర్ఐ కురుమూర్తితో కలిసి ఆకస్మికంగా పర్యటించిన తహసీల్దార్, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఆన్‌లైన్ ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ పనులను పరిశీలించారు. బీఎల్‌వోల పనితీరును సమీక్షించి, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం స్వగ్రామాలకు దూరంగా ఉన్నవారు, ఇటీవల నివాసం మార్చుకున్న కుటుంబాలు, అలాగే ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన వారిని గుర్తించి పూర్తి వివరాలతో ఆన్‌లైన్ ఎన్యుమరేషన్ నిర్వహించాలని సూచించారు. ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఇంటిని సందర్శించి అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు ఆదేశించారు.ప్రజలు 'సర్' ప్రక్రియపై నిర్లక్ష్యం వీడి స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ఎన్యుమరేషన్‌లో పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, అర్హులైన ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం గుర్తించాలని తెలిపారు.ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నమోదైన వివరాలను పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలను అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ కురుమూర్తి, జీపీఓ శ్రీశైలం, బీఎల్‌వోలు గోవిందమ్మ, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం కప్పలకు పెళ్లి....

### వరుణదేవుడిని ప్రసన్నం చేసేందుకు పూనుకున్న గ్రామస్తులు...

**కృష్ణా మండలం జూలై 11 ( ప్రజా జ్యోతి)**
నారాయణ పేట జిల్లా కృష్ణా మండలం ముడుమల్ గ్రామంలో తమ కోర్కెలను తీర్చాలని చాల మంది దేవుళ్ళకు పూజలు చేస్తారు. ముఖ్యంగా వరుణుడి కటాక్షం కోసం అభిషేకాలు చేస్తారు. కానీ ఓ పల్లె వాసులు మాత్రం వర్షాలు కురవాలని కప్పలకు పెళ్లి చేశారు. నారాయణ పేట జిల్లాలో జరిగిన ఈ వింత ఆచారం గురించి వివరాల్లోకి వెళ్తే..వర్షాకాలం మొదలై 2 నెలలు గడుస్తున్నా ఇప్పటికి వరుణ దేవుడు కరుణించక పోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. వర్షాలు లేక అదును దాటిపోతోందని రైతులు ఆవేదన పడుతున్నారు. నారాయణ పేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి రైతులు రెండు, మూడుసార్లు వేసిన విత్తనాలు విత్తిన మొలకలు రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. ఎకరాల కొద్ది పత్తి విత్తనాలు వేసినా వర్షాలు వస్తాయో లేదా అని రైతులు దిగులు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి వృధా అవుతుందని, అప్పులపాలు కాక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



# శ్రీశైలం గిరి ప్రదక్షిణ కు బయలుదేరిన పాలక బృందం

### – స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గిరి ప్రదర్శన
### – ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ మాధవరెడ్డి

**నాగర్ కర్నూల్ జులై 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు శ్రీశైల ఉత్తర ధారకంగా భాసులుతున్న ఉమామహేశ్వర క్షేత్రం నుంచి గిరి ప్రదర్శనలో భాగంగా శ్రీశైలం మల్లికార్జున ఆలయానికి చేరుకోవడం జరిగిందని చైర్మన్ మాధవరెడ్డి స్పష్టం చేశారు. శ్రీశైలం గిరిప్రదక్షిణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు శ్రీశైలం దేవస్థానంలో. శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యులు కట్ట సుధాకర్ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రత్యేక పూజలు,అభిషేకం..స్వామి వారికి,అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి .. ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. దేవస్థానం సిబ్బంది అధికారులు. పూజారులు శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం నుండి వచ్చిన చైర్మన్ పలకమండలి సభ్యులను . ఈఓ శ్రీనివాసరావు ని వేదమంత్రాలతో స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లను చేయడం జరిగింది ఆలయ ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. అదేవిధంగా స్వామివారికి అభిషేక అనంతరం . అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి కుంకుమార్చన మరియు ప్రత్యేక పూజలు గావించడం జరిగిందన్నారు.శ్రీశైల దేవస్థానం పూజారులు అధికారులు శ్రీశైలంకి ఉత్తరద్వారంగా ఉన్న శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం నుండి మొదటిసారిగా గ్రిది ప్రదక్షణ చేయడమనేది చాలా గొప్ప సంకల్పమని వారు శ్రీశైలం నాలుగు ద్వారాలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని తెలియజేశారు..
శ్రీశైలం భ్రమరాంబికా అమ్మవారు.. శ్రీ మల్లికార్జున స్వామి వారి. దివ్యానుగ్రహం మీ అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరడం జరిగింది ..ఈ యొక్క గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేకంగా చేయించడం అనేది చాలా గర్వించదగ్గ విషయమని శ్రీశైలం దేవస్థానం అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర చైర్మన్ ఈవో శ్రీనివాసరావు పాలకమండలి సభ్యులు పవన్ పాల్గొన్నారు

# ఈవ్‌టీజర్లకు మహిళా పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ

### – తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన.. మళ్లీ తప్పు చేస్తే కఠిన చర్యలు: జిల్లా పోలీసులు

**మహబూబ్‌నగర్, 11 జూలై (ప్రజా జ్యోతి బ్యూరో)**
మహిళలను, విద్యార్థినులను వేధించడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన కొంతమంది యువకులకు మహిళా పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారి తల్లిదండ్రులను కూడా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణంరాజు మాట్లాడుతూ మహిళలు, బాలికలు, విద్యార్థినులను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం, ఈవ్‌టీజింగ్ వంటి చర్యలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని తెలిపారు. ఇటువంటి చర్యల వల్ల బాధితులకు తీవ్ర మానసిక ఇబ్బందులు కలగడమే కాకుండా, నిందితుల భవిష్యత్తుపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, మహిళల పట్ల గౌరవభావం, సత్సంప్రదాయాలు అలవర్చేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. యువకులు బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని, మరోసారి ఇలాంటి వేధింపులకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.మహిళల భద్రతకు జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొంటూ, మహిళలు లేదా బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే మహిళా పోలీస్ స్టేషన్, షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712659365 లేదా అత్యవసర సేవ డయల్--112కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# ఆటోలపై ట్రాఫిక్ గుర్తింపు నంబర్లు తప్పనిసరి

## – ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు

మహబూబ్‌నగర్, 11 జూలై (ప్రజా జ్యోతి బ్యూరో) జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆటోలపై ట్రాఫిక్ గుర్తింపు నంబర్ల ప్రదర్శనపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నడిచే ప్రతి ఆటోకు ట్రాఫిక్ పోలీసులచే ప్రత్యేక గుర్తింపు నంబర్ కేటాయించబడిందని అధికారులు తెలిపారు. ఆ గుర్తింపు నంబర్ ఆటో ముందు, వెనుక, ఎడమ, కుడి వైపులా స్పష్టంగా కనిపించేలా పెద్ద అక్షరాలతో ప్రదర్శించాల్సి ఉండగా, పలువురు ఆటో యజమానులు టాప్‌లు మార్చడం లేదా ఇతర కారణాలతో వాటిని తొలగించినట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. దీంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు గుర్తింపు నంబర్లు లేని ఆటోలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్కడే పెయింటర్ సహాయంతో ఆయా ఆటోల నాలుగు వైపులా ట్రాఫిక్ గుర్తింపు నంబర్లను తిరిగి వేశారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆటోలపై ట్రాఫిక్ గుర్తింపు నంబర్లు ఉండటం వల్ల ప్రయాణికులు తమ విలువైన వస్తువులను ఆటోలో మరిచిపోయిన సందర్భాల్లో సంబంధిత ఆటోను సులభంగా గుర్తించి వాటిని తిరిగి అందించేందుకు వీలవుతుందని తెలిపారు. అలాగే ఆటో దొంగతనానికి గురైనా లేదా ఏదైనా నేర ఘటనలో వినియోగించినా సీసీ కెమెరాల ద్వారా త్వరగా గుర్తించేందుకు ఈ గుర్తింపు నంబర్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ప్రతి ఆటో




యజమాని తమ వాహనంపై ట్రాఫిక్ పోలీసులచే కేటాయించిన గుర్తింపు నంబర్‌ను నాలుగు వైపులా స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా, కాలుష్య నియంత్రణ (పీయూసీ) ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులు, పోలీసుల సూచనలను పాటిస్తూ సురక్షిత రవాణాకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ జానకి ఆదేశాల మేరకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు జిల్లాలో నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

## గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య



**వంగూరు జూలై 11 (ప్రజా జ్యోతి)**

నార కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల కేంద్రానికి చెందిన ఎరుకలు వెంకటయ్య మరణించడం జరిగింది.

ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి 5000/. ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి యాదగిరి రావు గారు. రఫీ ,మాజీ వార్డు మెంబర్స్ , శ్రీశైలం, రమేష్ పాల్గొనడం జరిగింది.

# ఒక వ్యక్తి ఒక ఓటును మాత్రమే కలిగి ఉండాలి

## – ఈ నెల 24లోగా ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి

## అర్హుల ఓటు తొలగిపోకూడదు, అనర్హుల ఓటు జాబితాలో ఉండకూడదు

## – జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ జులై 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

అచ్చంపేట లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలోని 2వ వార్డు సాయినగర్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన, డిజిటలైజేషన్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రామ్‌సింగ్ అనే ఓటరు వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, ప్రజల నుంచి తిరిగి స్వీకరించిన దరఖాస్తులు, వాటి ఆన్‌లైన్ నమోదు, పెండింగ్‌లో ఉన్న ఫారాలు, నమోదు పురోగతి వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రతిబిఎల్ ప్రతిరోజు 60 మంది ఓటర్ల వివరాలను నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 24వ తేదీలోగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని రెవెన్యూ, ఎన్నికల శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన పౌరుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలని, ఎవ్వరూ ఈ ప్రక్రియకు ఏ ఒక్క అర్హులైన ఓటర్ దూరం కాకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

అనర్హులైన ఓట్ల తొలగింపు ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుని చర్చించిన అనంతరమే తుది నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ఒక్క ఓటు కూడా పొరపాటున తొలగిపోకుండా, అదే సమయంలో అనర్హులైన ఓట్లు జాబితాలో కొనసాగకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలోని వేర్వేరు నియోజకవర్గాల్లో లేదా ఇతర జిల్లాల్లో ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటర్లు నమోదు కావడం చట్టవిరుద్ధమని జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ హెచ్చరించారు. భారత ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన డెమోగ్రాఫికల్లీ సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా డూప్లికేట్ ఓట్లను సులభంగా గుర్తించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సాంకేతిక వ్యవస్థతో ఒకే వ్యక్తి పేరుతో వివిధ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏడాది వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. అలాంటి కేసులు గుర్తించిన వెంటనే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడమే భారత ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. చిరునామా మార్పు, పేరు, వయస్సు, కుటుంబ వివరాల్లో మార్పులు ఉన్నవారు కూడా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగానిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఎన్నికల సంఘం

మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకువిశ్వసనీయమైన ఓటర్ల జాబితాను అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, అచ్చంపేట తాహసిల్దార్ సైదులు, బి ఎల్ ఓ తిరుపతమ్మ, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.



# నేడు జర్నల్ మర్చంట్ అసోసియేషన్ నూతన భవన ప్రారంభోత్సవం

## -40 ఏళ్ల సేవా ప్రస్థానానికి మైలురాయి

## -అసోసియేషన్ అధ్యక్షుడు ముస్తాఖ్ అహ్మద్

నాగర్ కర్నూల్ : జూలై 11 (ప్రజా జ్యోతి)





నాగర్ కర్నూల్ జర్నల్ మర్చంట్ అసోసియేషన్ స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి అవుతున్నసందర్భంగా అసోసియేషన్ సభ్యులకు ఇదొక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచి నాల్గు దశాబ్దాలుగా వ్యాపారుల ఐక్యత సేవాభావం,పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్న అసోసియేషన్ నేడు సొంత భవనాన్ని నిర్మించుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైందని అసోసియేషన్ అధ్యక్షుడు ముస్తాఖ్ అహ్మద్ అన్నారు.సభ్యుల ఐక్యతకు ప్రతీకగా ఈ నూతన భవనం కుల,మత భేదాలకు అతీతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న సభ్యులు అసోసియే
షన్ అభివృద్ధికి విశేష కృషిచేశారని,భావనానికి స్థల సమీకరణ ఆర్థిక సహాయం,నైతిక మద్దతు వంటి అనేక విధాలుగా సభ్యులు సహకరించగా ప్రస్తుత గౌరవ అధ్యక్షులు మిరుదొడ్డి శ్యాంసుందర్ నాయకత్వ కృషి,అసోసియేషన్ భవననిర్మాణలో కీలక పాత్ర పోషించిందని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.నేడు (ఆదివారం) ఉ :10 గంటలకునూతన భవనం ప్రారంభోత్సవం ఉంటుందని,ఈ కార్యక్రమంలో ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి,అనంతరం సభ్యులు,ఆహ్వానితులకు భోజన ఏర్పాటు చేయడం జరిగిందని,మర్చంట్ అసోసియేషన్ సభ్యులందరు ఈ సమాచారాన్ని వ్యక్తిగత ఆహ్వానంగా భావించి,భేదాభిప్రాయాకు తావులేకుండా కుటుంబ సభ్యులతో సమయానికి నూతన భవనం వద్దకు చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ అధ్యక్షుడు ముస్తాఖ్ అహ్మద్,గౌరవ అధ్యక్షుడు మీడిదొడ్డి శ్యామ్ సుందర్,పి.ఆర్.ఓ బాదం పరమేశ్వర్ లుశనివారం ప్రకటనలో సభ్యులందరికీ పేరుపేరునా ఆహ్వానం తెలిపారు.